సంక్రాంతి వచ్చిందే తుమ్మెదా..



గాజులరామారం శ్రీనిధి గ్లోబెల్ స్కూల్‌లో సంబురాలు

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని సంక్షేమ సంఘాలు, విద్యా సంస్థల్లో శుక్రవారం సంక్రాంతి పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసి బహుమతులు అందజేశారు. అదే విధంగా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి భోగిమంటలు, పొంగలి వంటకం తయారు చేయడంతో పాటు హరిదాసుల నృత్యాలు, పతంగులను ఎగురవేసి సందడి చేశారు.

– రంగారెడ్డినగర్



కొంపల్లిలో ముగ్గుల పోటీల్లో మహిళలు వేసిన రంగవల్లికలను పరిశీలిస్తున్న చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్



బీవీఆర్ఐటీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో భోగి మంటలు వేసిన దృశ్యం



నిజాంపేట్ రవీంద్రభారతి స్కూల్‌లో..



జగద్గిరిగుట్ట రాజధాని స్కూల్‌లో...



ఆదర్శ్‌నగర్‌లోని గాయత్రి గ్రామర్ స్కూల్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న కరస్పాండెంట్ అలివేలు మంగతాయారు



సూరారం నార్త్ సిటీ హైస్కూల్‌లోసంక్రాంతి పండుగ ఉట్టి పడేలా..



పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో వేసిన సంక్రాంతి ముగ్గు



భగత్‌సింగనగర్‌కాలనీలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్సీకార్పొరేషన్ చైర్మన్ పడమర్తి రవి



మగ్దూమ్‌నగర్ శ్రీచైతన్య విద్యానికేతన్‌లో జరిగిన ముగ్గుల పోటీల విజేతలతో సీఐ సైదుల



గాగిల్లాపూర్‌లో జరిగిన ముగ్గుల పోటీలకు హాజరైన చైర్‌పర్సన్ కృష్ణవేణి

క్లుప్తంగా

24 నుంచి సమన్వయ్ కార్యక్రమం

కుత్బుల్లాపూర్: కొంపల్లిలోని శివశివాని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఈనెల 24, 25 తేదీల్లో సమన్వయ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రెసిడెంట్ ఆరతి సంపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమన్వయ్ కార్యక్రమానికి ఏపీ, తెలంగాణాలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి 1500 మంది విద్యార్థులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. అందులో భాగంగా వివిధ ఫార్మల్, ఇన్ ఫార్మల్ ఈవెంట్లు ఉంటాయన్నారు. శ్రేష్ఠ, సంఖ్యా, స్టార్టప్, బిజినెస్ క్విజ్ మొదలగునవి ఫార్మల్ ఈవెంట్లతో పాటు విద్యార్థుల తెలివితేటలను, సృజనాత్మకతను వెలికితీసే కార్యక్రమాలు, ఫ్యాషన్ షో, ఫ్లోర్ ఫ్యూషన్ వంటి కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. శ్రేష్ఠ (యంగ్ మేనేజర్)లో గెలుపొందిన విద్యార్థులకు మొదటి బహుమతిగా ఒక్క ఎలక్ట్రిక్ బైక్‌ను, అదే విధంగా సమ్రాజ్ ఆఫ్ సమన్వయ్ ట్రోఫీని అన్ని ఈవెంట్‌లో గెలుపొందిన కళాశాలకు బహూకరిస్తారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ, ఇంజినీరింగ్, పోస్టుగ్రాడ్యుయేషన్ విద్యార్థులు పాల్గొనవచ్చని, ఇతర వివరాలకు సమన్వయ్ వ్యవహారకర్తలు చైతన్య (9160054499), బాలాంజీరెడ్డి (9885393343) లను సంప్రదించాలన్నారు.

అనుమతులు లేకుండా రసాయనాల రీఫిల్లింగ్



పెద్ద ట్యాంకుల నుంచి చిన్న డబ్బాల్లోకి రసాయలను నింపుతున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: అనుమతులు లేకుండా రసాయనాలను రీఫిల్లింగ్ చేస్తున్న ఇద్దరు కంపెనీ నిర్వాహకులపై పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దూలపల్లి ఇండస్ట్రీ ఏరియాలోని నవభారత్ కెమికల్స్, ఆర్‌సీఆర్ మార్కెటింగ్ యాజమాన్యాలు ఎటువంటి అనుమతులు లేకుండా, ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకుండా పెద్ద పెద్ద డ్రమ్ముల నుంచి రసాయాలను చిన్న క్యాన్‌లలోకి రీఫిల్లింగ్ చేస్తున్నారు. సమాచారం అందడంతో ఈనెల 12న రాత్రి 7 గంటల సమయంలో పోలీసులు సదరు పరిశ్రమలపై దాడులు నిర్వహించారు. అక్కడున్న సిబ్బందిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీంతో పరిశ్రమలను నడుపుతున్న కామరాజు, ఎట్టయ్యలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సురక్షిత ప్రాంతాల్లో పతంగులు ఎగురవేయాలి

నిజాంపేట్: సంక్రాంతి పండుగ సందర్భంగా పతంగులను సురక్షిత ప్రాంతాల్లో ఎగురవేయాలని, తగు జాగ్రత్తలు తీసుకుంటూ పండుగను సంతోషంగా గడపాలని విద్యుత్ అధికారులు కోరుతున్నారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా, బహిరంగ ప్రదేశాల్లో, మైదానాల్లో మాత్రమే పతంగులు ఎగురవేయాలన్నారు. కాటన్, నైలాన్, లినెన్‌తో చేసిన మాంజాలను మాత్రమే వాడాలని కోరారు. మెటాలిక్ మాంజాలు వాడొద్దని, ఒకవేళ మెటాలిక్ మాంజాలు విద్యుత్ లైన్లపై పడినట్లయితే షాక్ కలిగే అవకాశం ఉంటుందన్నారు. మాంజాల కారణంగా విద్యుత్ తీగలు తెగి పడితే వెంటనే విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నం.1912కు లేదా సమీప విద్యుత్ కార్యాలయానికి, లేదా సంస్థ మొబైల్ యాప్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

కంటి వెలుగు కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి



కుత్బుల్లాపూర్‌లో కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ మమత, అధికారులు

కుత్బుల్లాపూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ఏర్పాటు చేయబోయే కంటి వెలుగు కేంద్రాలను జోనల్ కమిషనర్ ఉప కమిషనర్లు మంగతాయారు, ప్రశాంతిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజల తాకిడిని దృష్టిలో పెట్టుకుని కంటి వెలుగు కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలని జడ్సీ వారికి సూచించారు. ఎస్ఈ చెన్నారెడ్డి, డిప్యూటీ ఇఇ, ఏఈ లు, మెడికల్ సిబ్బంది ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

నిజాంపేట్: ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నిజాంపేట్ కార్పొరేషన్ 33వ వార్డులోని సైదప్ప బస్తీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు స్థానికంగా నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విదుత్ సమస్యలను శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లలో మాట్లాడి పరిష్కరించే దిశగా పనుల చేపట్టాలని కోరారు. ఆయన వెంట బస్తీ నాయకుడు రాము, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులతో తప్పని ఇబ్బందులు



కుత్బుల్లాపూర్: అధికారుల అసంపూర్తి పనులను స్థానిక ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. జీడిమెట్ల డివిజన్ వసంత్ విహార్ కాలనీలో మూడు నెలల క్రితం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు పనులు పూర్తి చేశారు. అయితే సదరు కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ సమయంలో వెలువడిన మట్టి, సిమెంట్ వ్యర్థాలను రోడ్డు మీదనే వదలి చేతులు దులుపుకున్నారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారుతోందని కాలనీ ప్రజలు ఏఈ సురేందర్ నాయక్‌కు పలుమార్లు విజ్ఞప్తి చేసినా స్పందన కరువైందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డుపై ఉన్న మట్టి పెల్లాలను, రాళ్లను తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

వీధి కుక్కల బెడదపై స్పెషల్ డ్రైవ్



వీధి కుక్కల దాడిలో గాయపడిన బాలుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శ్రీశైలంయాదవ్

కుత్బుల్లాపూర్: వీధి కుక్కల బెడదను నివారించేందుకు కృషి చేస్తున్నామని కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. కొంపల్లి మున్సిపల్ పరిధి 4వ వార్డులోని మొగుళ్లకుంటలో కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన బాలుడు తనుశ్రీ కుటుంబ సభ్యులను శుక్రవారం శ్రీశైలంయాదవ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలో కుక్కల బెడద తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని, ఇప్పటికే యానిమల్ కేర్ సెంటర్ నిర్మాణానికి స్థలం కేటాయించామని, త్వరలోనే నిర్మాణం చేపడతామన్నారు. యానిమల్ కేర్ సెంటర్ అందుబాటులోకి వస్తే వీధి కుక్కలకు కూ.ని. ఆపరేషన్లు నిర్వహించి వాటిని పెరుగుదలను నిరోధిస్తామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, డీఈఈ చిరంజీవులు, కౌన్సిలర్ సువర్ణ, అధికారులు ఉన్నారు.

ఓక్రిడ్జ్‌లో టీఈడీఎక్స్ కార్యక్రమం

దుండిగల్: బాచుపల్లిలోని ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శుక్రవారం 'రిప్పల్స్'నేపథ్యంలో టీఈడీఎక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నటి దివి వాద్యా, ట్రాన్స్‌జెండర్ హక్కుల కార్యకర్త నాన్ జోషి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దివి మాట్లాడుతూ.. తాను నటిగా మారానుకున్నప్పుడు సానుకూల, ప్రతికూల ప్రభావాలుంటాయని ముందే ఊహించానన్నారు. ఎన్ని ప్రతికూలతలు ఎదురైనా ధైర్యంగా వాటిపై విజయం సాధించానన్నారు. అనంతరం నాన్ జోషి మాట్లాడుతూ... తన చిన్నతనం ఎంతో సరదాగా గడిచిపోయిందని, రాను రాను తనలో వచ్చిన మార్పుల నేపథ్యంలో ఎన్నో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోనాల్సి వచ్చిందన్నారు. వాటన్నింటిని అధిగమించి మిస్ వరల్డ్ డైవర్సిటీ పోటీల్లో భారతదేశం తరపున పాల్గొని మూడుసార్లు అందాల రాణిగా నిలిచానన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బల్జీత్ ఒబెరాయ్ ఈవెంట్ కో.ఆర్గనైజర్ స్వర్ణ దయానా, విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ హత్య!

దుండిగల్: గుర్తు తెలియని మహిళ హత్యకు గురైన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వెనుక ఉన్న వెంకట్రామ్‌నగర్ కాలనీలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం పక్కన ఉన్న ఓ పాడుబడ్డ గదిలో శుక్రవారం సాయంత్రం ఓ గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు స్థానికుల ద్వారా పోలీసులు సమాచారం అందుకున్నారు. దీంతో సీఐ రమణారెడ్డి, పోలీసుల బృందం వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మహిళ(48) మృతదేహాన్ని పరిశీలించారు. ఆమె ముఖంపై తీవ్ర గాయాలున్నాయని, నిందితులు ముఖంపై పిడిగుద్దులతో గాయపరిచి లేదా తలను నేలకేసి కొట్టి హత్య చేసి ఉండొచ్చని భావిస్తున్నారు. మహిళ హత్య జరిగి 24 గంటలై ఉంటుందన్నారు. మెరూన్ రంగు చీర, పచ్చరంగు జాకెట్ ధరించిందని, ఘటనా స్థలంలో ఎటువంటి ఆధారాల లభ్యం కాలేదని పోలీసులు తెలిపారు. పోలీసులు మృతదేహానికి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ప్రజా సమస్యల పరిష్కారం దిశగా కృషి

ఎమ్మెల్యే వివేకానంద్



నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘం నాయకులు పేట్‌బషీరాబాద్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లలో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

- కుత్బుల్లాపూర్ నియోజకవర్గం తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సంపత్ మాధవరెడ్డి, కస్తూరి బాలరాజు, గౌసుద్దిన్, గుమ్మడి మధుసుధన్ రాజు, కుంట సిద్ది రాములు, కిషోర్ చారి, మల్లేష్, రామిరెడ్డి, మల్లారెడ్డి, సతీష్, సాంబయ్య, వసంత, శేఖర్, శారద, వెంకటేష్, నారాయణరెడ్డి, ప్రభాకర్‌చారి, లక్ష్మణ్‌గౌడ్, ఉప్పలయ్య, ఇర్ఫాన్, క్రాంతియాదవ్, భారతి తదితరులు పాల్గొన్నారు.
- జీడిమెట్ల డివిజన్ పరిధిలోని అయోధ్యనగర్‌కు చెందిన శ్రీవిరాట్ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రెసిడెంట్ కృష్ణాచారి, జనరల్ సెక్రెటరీ రమేష్‌చారి, సుభాష్‌చారి, బ్రహ్మయ్యచారి, ఆంజనేయులుచారి, బాలరాజుచారి, నారాయణచారి, శ్రీశైలం, జనార్దన్‌చారి తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి సెలవుల రద్దు దుర్మార్గపు చర్య

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



కుత్బుల్లాపూర్: కంటి వెలుగు కార్యక్రమం పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా వైద్య సిబ్బందికి పండుగ సెలవులు లేకుండా చేయడం దుర్మార్గమని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శుక్రవారం షాపూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 14, 15వ తేదీలలో భోగి, సంక్రాంతి పండుగలు ఉన్నాయని అన్నారు. రెండు పర్వదినాలు సెలువు దినాల్లో రావడంతో సోమవారం ఉద్యోగులు ఆప్షనల్ తీసుకునే అవకాశముందన్నారు. అయితే తెలంగాణ ప్రభుత్వం శని, ఆదివారాల్లో సెలవులను రద్దు చేసి వైద్య విభాగంలో పని చేస్తున్న ఉద్యోగులందరిని విధులకు రావాలని ఆదేశాలు జారీ చేయడం హిందూ వ్యతిరేక చర్యల్లో భాగమేనని ఆరోపించారు.

- కంటి వెలుగు కార్యక్రమంలో విధులు నిర్వహించేలా బలవంతంగా ఉద్యోగులపై ఒత్తిడి తెస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సర్క్యులర్ జారీ జారీ చేయడం తగదన్నారు. పండగ పూట కుటుంబ సభ్యులతో గడపాల్సిన ఉద్యోగులను ఆదివారం రోజు కూడా విధులకు హాజరు కావాలని హిందూ వ్యతిరేక ప్రభుత్వం బలవంత పెట్టడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. రంజాన్, క్రిస్మస్‌లకు ప్రత్యేకమైన సెలవు దినాలు ప్రకటిస్తూ అవసరం లేకున్నా ఆప్షన్ హాలిడేస్ ఇస్తూ ఇతర మతస్తులకు సహకారం అందిస్తోంది.
- కానీ హిందువుల పండుగల విషయంలో మాత్రం సంపూర్ణమైన వివక్ష కనబరుస్తోందన్నారు. పండుగ సెలవు దినాలలో రెండో శనివారం, ఆదివారం కూడా వాడుకోకుండా కుటుంబ సభ్యులకు దూరం చేయడం హిందువుల పండుగలను జరుపుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం బలవంతంగా విధులు నిర్వహించాలని సర్క్యులర్ జారీ చేయడం తగదన్నారు. రాష్ట్రంలో హిందువుల మధ్య కులాల వైషమ్యాలు సృష్టిసూ సీఎం తన రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు.

పేదరికాన్ని రూపుమాపడానికే 'హయా'





నిజాంపేట్: నిజాంపేట్ ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థి ఐక్యరాజ్య సమితి సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ సాధనలో భాగంగా పేదరికాన్ని రూపు మాపడానికి తన వంతు కృషి చేస్తోంది. గచ్చిబౌలిలోని ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న ఆక్కుల లారణ్యకు చిన్ననాటి నుంచి ఫొటోగ్రఫీపై మక్కువ. ఈ నేపథ్యంలో పేదల కష్టాలపై అవగాహన కల్పించేందుకు 'హయా ఫొటోగ్రఫీ'ద్వారా కళ్లకు కట్టేటట్లు ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేసింది. పేదరికం లేదు.. అందరికి సమానత్వం.. అనే నినాదంతో పేదరికాన్ని రూపమాపడానికి నిధుల సేకరణ చేపట్టి వెనుకబడి ప్రజలకు సహాయం చేయడానికి ప్రాజెక్ట్ హయాను ప్రారంభించి నేటి యువ తరానికి ఆదర్శంగా నిలుస్తోంది. సమాజాభివృద్ధి కోసం చేపట్టిన ఈ ప్రాజెక్ట్‌లో మానవతావాదులు భాగస్వామ్యం కావాలని కోరుతోంది.

ప్రైవేటు బస్సుల దోపిడీపై స్పెషల్ డ్రైవ్

- మేడ్చల్ జిల్లా రవాణా అధికారి కిషన్
- 23 బస్సులు సీజ్ చేసినట్లు వెల్లడి



మేడ్చల్ ఆర్టీఏ అధికారులు సీజ్ చేసిన ప్రైవేట్ బస్సులు

కుత్బుల్లాపూర్: వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు ఉంటేనే బయట తిరగాలని లేనిపక్షంలో కఠినంగా వ్యవహరిస్తామని మేడ్చల్ జిల్లా రవాణా అధికారి కిషన్ అన్నారు. వరంగల్, నాగపూర్, ముంబై హైవేలపై వివిధ ప్రాంతాలకు వెళ్తున్న ప్రైవేటు బస్సులను స్పెషల్ డ్రైవ్ నిర్వహించి తనిఖీలు చేపట్టారు. సంక్రాంతి పండుగ సందర్భంగా వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రజల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేశారు.

- అందులో భాగంగా నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న 23 ప్రైవేటు బస్సులను సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.
- ఈ సందర్భంగా శుక్రవారం డీటీఓ కిషన్ 'సాక్షి'తో మాట్లాడుతూ... ఈనెల 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకు వివిధ ప్రాంతాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ప్రైవేటు బస్సులతో పాటు ఇతర వాహనాలను గుర్తించి సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. ఫిట్నెస్ లేకున్నా, టాక్సీ చెల్లించకుండా, డ్రైవింగ్ లైసెన్స్ లేకున్నా వాహనాలు బయటకు తీసుకు రావద్దన్నారు. ఎవరైనా అలా రోడ్లపై కనిపిస్తే మాత్రం ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు.
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో ఉన్న అన్ని ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. అటు విజయవాడ హైవే.. ఇటు బెంగళూరు హైవే.. వరంగల్.. రాజీవ్ రహదారి అన్ని ప్రాంతాల్లో రవాణా శాఖ అధికారులు ఈ తనిఖీలు చేపడుతున్నారని తెలిపారు. బుధవారం 11 కేసులు నమోదు కాగా గురువారం 12 కేసులు నమోదు చేసినట్లు డీటీఓ కిషన్ తెలిపారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ప్రతాప్ రాజా, రవికుమార్, నేహా, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ త్రివేణి తదితరులు ఆయా ప్రాంతాల్లో జరిగిన తనిఖీల్లో పాల్గొన్నారు.